Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 175 మేడ్చల్ మల్కాజ్‌గిరి 17 జూలై 2024 బుధవారం పేజీలు : 4

## ట్రంప్‌పై మస్క్ భారీ బెట్

### ప్రతి నెల రూ.365 కోట్ల ఆర్థిక సహాయం!

ప్రపంచ కుభేరుడు, టెస్లా సంస్థ అధినేత ఎలన్ మస్క్ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌కు భారీ ఆర్థిక సహాయం అందిస్తున్నారు. ట్రంప్‌నకు తన సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ట్రంప్ ఎన్నికల ఖర్చు కోసం భారీగా నిధులు సమకూర్చేందుకు మస్క్ సిద్ధమైనట్టు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ట్రంప్ ఎన్నికల ఖర్చు కోసం ప్రతి నెల 45 మిలియన్ డాలర్ల (రూ.365 కోట్లు) సమకూర్చడానికి మస్క్ అంగీక రించినట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ ఓ కథనాన్ని ప్రచురించింది.

# పాస్‌బుక్ ఆధారంగానే రైతు రుణమాఫీ

## పారదర్శకంగా ప్రజాహిత పాలనను అందించటమే మా లక్ష్యం - రేవంత్‌రెడ్డి




హైదరాబాద్: రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. పాస్‌బుక్ ఆధారంగానే కుటుంబానికి రూ.2 లక్షల రుణమాఫీ ఇస్తామని స్పష్టం చేశారు. రైతు కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్‌కార్డు నిబంధన పెట్టామని తెలిపారు. పారదర్శకంగా ప్రజాహిత పాలనను అందించటమే తమ ప్రభుత్వం ఎంచుకున్న మొదటి ప్రాధాన్యమని సీఎం స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమతుల్యం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని వివరించారు. ప్రభుత్వ ప్రాధాన్యతలతో పాటు ప్రజల ప్రయోజనాలను అర్థం చేసుకొని పని చేయాలని జిల్లా కలెక్టర్లకు సీఎం రేవంత్ దిశా నిర్దేశం చేశారు. సచివాలయంలో మంగళవారం జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండా సురేఖ, రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సదస్సును ప్రారంభించగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రారంభోపన్యాసం చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో పాటు అన్ని శాఖల కార్యదర్శులు, అన్ని జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

**సమర్థులైన యువ కలెక్టర్లను నియమించాం..** అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ... తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జిల్లా కలెక్టర్లతో ఇది రెండో సమావేశమని, ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరేనని సీఎం గుర్తు చేశారు. జిల్లా స్థాయిలో ప్రభుత్వానికి వారధులు.. సారధులు మీరేనని అన్నారు. ఇటీవలే రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సమర్థులైన యువ కలెక్టర్లను నియమించామని, రాజకీయ ఒత్తిళ్లు, ఎలాంటి రాగద్వేషాలు లేకుండా కలెక్టర్ల బదిలీలు చేపట్టామని తెలిపారు.

**కలెక్టర్లదే కీలక బాధ్యత..** ఐఏఎస్ అధికారుల కెరీర్‌లో జిల్లా కలెక్టర్లుగా పని చేయటమే అత్యంత కీలకమైన అవకాశమని సీఎం అన్నారు. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలుండే బాధ్యతలతో పాటు క్షేత్ర స్థాయిలో అన్ని అంశాలపై అవగాహన వస్తుందని, జిల్లాల్లో పని చేసిన అనుభవమే భవిష్యత్తులో ఉపయోగపడుతుందని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను చివరి లబ్ధిదారుల వరకు చేరవేసే కీలక బాధ్యత కలెక్టర్లదేనని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కలెక్టర్లు ఏ జిల్లాలో పని చేసినా.. అక్కడి జిల్లా ప్రజల మదిలో చెరగని ముద్ర వేయాలని, తాము పని చేసే ప్రాంత ప్రజలందరి అభిమానాన్ని అందుకునేలా పని చేయాలని సీఎం అన్నారు. ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం టీచర్లకు ప్రమోషన్లతో పాటు బదిలీలు చేసిందని, కొన్నిచోట్ల టీచర్లు బదిలీపై వెళుతుంటే విద్యార్థులు సొంత కుటుంబసభ్యుడిలా స్పందించారు. వాళ్లకు అడ్డుపడి కన్నీళ్లు పెట్టుకున్న సంఘటనలు మీడియాలో చూసినట్లు సీఎం చెప్పారు. జిల్లాల్లో కలెక్టర్లు బదిలీ అయినా ప్రజల నుంచి అలాంటి స్పందన వచ్చేలా పనితీరు ఉండాలని అభిప్రాయపడ్డారు. అక్కడి ప్రజలు కలెక్టర్‌ను బదిలీ చేయకుండా అడ్డుకునేంత అనుబంధాన్ని సంపాదించుకోవాలని ఉదాహరణగా చెప్పారు.

**తెలంగాణ సంస్కృతిలో ఐఏఎస్‌లు భాగం కావాలి..** వివిధ రాష్ట్రాల నుంచి వివిధ సంస్కృతుల నుంచి వచ్చిన ఐఏఎస్ అధికారులు తెలంగాణలో పని చేస్తున్నారని, విధి నిర్వహణలో భాగంగా ఇక్కడి భాష నేర్చుకుంటే సరిపోదని, భాషతో పాటు తెలంగాణ సంస్కృతిలో భాగస్వామ్యం కావాలని సీఎం రేవంత్ కలెక్టర్లకు సూచించారు. తెలంగాణను తమ సొంత రాష్ట్రంగా భావించి పని చేయాలని, ఇక్కడి ప్రజలతో మమేకం కావాలని, ప్రజలకు ప్రయోజనం చేకూరేలా మానవీయ కోణంలో నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఒక శంకరన్, ఒక శ్రీధరన్‌లా సామాన్య ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకునేలా ఐఏఎస్‌లు పని చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రజల ఆలోచన ఏమిటో తెలుసుకోవాలని.. కేవలం ఏసీ గదులకే పరిమితమైతే ఎలాంటి సంతృప్తి ఉండదని అన్నారు. తాము చేపట్టే ప్రతి పని.. ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజలకు తెలిసేలా ఉండాలని సీఎం రేవంత్ వివరించారు.

**క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందే..** జిల్లా కలెక్టర్లు అందరూ క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందేనని ముఖ్యమంత్రి ఆదేశించారు. పాఠశాలలు, హాస్టళ్లు, ఆస్పత్రుల ద్వారా ప్రజలకు సేవలందించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి పేద విద్యార్థిపై ప్రభుత్వం ప్రతి నెలా రూ.85వేలు ఖర్చు పెడుతుందని అన్నారు. తెలంగాణ పునర్నిర్మాణంతో పాటు పిల్లల భవిష్యత్తును నిర్దేశించే విద్యా వ్యవస్థను సమర్థంగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు సూచించారు. అందుకే ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రులను పర్యవేక్షించాల్సిన బాధ్యత కలెక్టర్లు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీలకు వెళ్లినప్పుడు ప్రజలతో మాట్లాడాలని, అక్కడికక్కడ పరిష్కారమయ్యే చిన్న చిన్న పనులను వెంటనే పరిష్కరించాలని సీఎం రేవంత్ కలెక్టర్లకు సూచించారు.

## రైతుల ఖాతాల్లో ఈనెల 18న రూ.6వేల కోట్లకు పైగా జమ: మంత్రి తుమ్మల



హైదరాబాద్: రాష్ట్రంలో పంట రుణాల మాఫీకి సంబంధించి రైతుల ఖాతాల్లో ఈనెల 18న రూ.6వేల కోట్లకు పైగా జమ చేయనున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. భూమి పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ చేస్తామని, కుటుంబ నిర్ధారణకే రేషన్ కార్డు ప్రామాణికమని స్పష్టం చేశారు. అర్హులైతే రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ వర్తిస్తుందన్నారు. ఎమ్మెల్యేలు, ఐఏఎస్‌లు, ఉన్నతాధికారులకు రుణమాఫీ ఉండదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 11.50లక్షల మంది రైతులు రూ.లక్ష వరకు రుణాలు తీసుకున్నారని తెలిపారు. దాదాపు 30లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసేందుకు రూ.31వేల కోట్లు అవసరమని మంత్రి వివరించారు. రాష్ట్రంలో పంట రుణాల మాఫీకి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిన విషయం తెలిసిందే. పథకం అమలు విధి విధానాలను వివరిస్తూ సోమవారం ఉత్తర్వులు (జీవో ఆర్టీ నంబరు 567) జారీ చేసింది. ఒక రైతు కుటుంబానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయనుంది. రైతు కుటుంబం గుర్తింపునకు తెల్లరేషన్ కార్డు(ఆహారభద్రత కార్డు)ను ప్రామాణికంగా తీసుకోనున్నట్లు ప్రకటించింది.

అన్ని షెడ్యూల్డు, వాణిజ్య, ప్రాంతీయ గ్రామీణ, జిల్లా సహకార బ్యాంకుల నుంచి 2018 డిసెంబరు 12 నుంచి మంజూరైన, రెన్యువలైన రుణాలకు, 2023 డిసెంబరు 9 వరకు బకాయి ఉన్న పంట రుణాలకు, స్వల్పకాలిక రుణాలకు ఇది వర్తిస్తుందని... రుణాల అసలు, దానికి వర్తించే వడ్డీని కలిపి రూ.2 లక్షలు మాఫీ అవుతాయని ప్రభుత్వం తెలిపింది.



## భారాస ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత

దిల్లీ: మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటూ తిహాడ్ జైలులో ఉన్న భారాస ఎమ్మెల్సీ కవిత అస్వస్థతకు గురయ్యారు. దీంతో తిహాడ్ జైలు నుంచి ఆమెను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్టు సమాచారం. దిల్లీ మద్యం కేసులో మనీ లాండరింగ్ నేరారోపణలతో అరెస్టయిన కవిత దాదాపు నాలుగు నెలలుగా జైల్లో ఉన్నారు. ఆమెపై సీబీఐ, ఈడీలు వేర్వేరు కేసులు నమోదు చేశాయి.



## బండి సంజయ్‌కు బహిరంగ లేఖ..

కరీంనగర్: కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగ లేఖ రాశారు. కేంద్ర క్యాబినేట్‌లో స్థానం దక్కించుకున్నందుకు ముందుగా బండి సంజయ్‌కు పొన్నం శుభాకాంక్షలు చెప్పారు. తెలంగాణ రాష్ట్రానికి, ముఖ్యంగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి వచ్చే బడ్జెట్ సమావేశాల్లో కేంద్రం నిధులు కేటాయించేలా చూడాలని లేఖలో కోరారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి మరిన్ని నిధులు తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన హామీలు, వాగ్దానాలు నెరవేర్చడంలో బండి సంజయ్ చొరవ తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.



# కొలిక్కి వచ్చేనా..!?

## తెలుగు రాష్ట్రాల విభజన సమస్యలపై కేంద్రం కీలక సమావేశం

హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల విభజన సమస్యలపై కేంద్ర ప్రభుత్వం మరోసారి దృష్టి కేంద్రీకరించింది. ఈనెల 24న ఢిల్లీలో కేంద్ర హెూంశాఖ కార్యదర్శి ఆధ్వర్యంలో కీలక సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి హాజరుకావాలని రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్ర హెూంశాఖ లేఖ రాసింది. ప్రత్యేకించి షెడ్యూల్ 13లోని అంశాలపై 24న సమావేశంలో చర్చించనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య సమస్యలపై తొలిసారిగా ఈ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ప్రధాన సమస్యలపై చర్చించనున్నారు. విభజన చట్టం షెడ్యూల్ 13లో రెండు రాష్ట్రాల్లోని విద్యాసంస్థల ఏర్పాటు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల అంశాలపై మాట్లాడనున్నారు. తెలంగాణలో స్టీల్ ఫ్యాక్టరీ కోచ్ ఫ్యాక్టరీ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు , ఆంధ్రప్రదేశ్‌లోనూ కడప స్టీల్ ప్లాంటు, పలు జాతీయ రహదారుల ప్రాజెక్టులపై చర్చించనున్నారు. కొద్దిరోజుల క్రితం ప్రధాని మోదీ, కేంద్ర హెూం మంత్రి అమిత్‌షాని రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి కలిసిన సంద ర్భంలో విభజన చట్టంలోని అంశాల అమలు గురించి ప్రస్తావించిన విషయం తెలిసిందే. అటు రెండు రాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారం కోసం తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం అయిన విషయం తెలిసిందే.

**ఢిల్లీకి సీఎం చంద్రబాబు.. ఏం చేయబోతున్నారంటే..?** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ( మంగళవారం) ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. ఈరోజు సాయంత్రం గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో సీఎం ఢిల్లీకి వెళ్లారు. రాత్రికి అక్కడే బసచేసి రేపు(బుధవారం) పలువురు కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి భేటీ అవుతారు. రెండు వారాల వ్యవధిలోనే రెండోసారి హస్తిన బాట పట్టడంతో చంద్రబాబు పర్యటనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షాతో బాబు రేపు భేటీ కానున్నారు. విభజన సమస్యల పరిష్కారం, ఇతర రాజకీయ అంశాలపై సీఎం చంద్రబాబు చర్చించనున్నారు.

# సంపాదకీయం

## రాహుల్ కి రాహుకాలం పోయిందిగా !

కాంగ్రెస్ అగ్ర నేత గాంధీల ఐదో తరం వారసుడు రాహుల్ గాంధీకి రాహు కాలం పోయింది అని అంటున్నారు. రాహుల్ గాంధీ 2004లో పొలిటికల్ గా ఎంట్రీ ఇచ్చారు. అంటే రెండు దశాబ్దాల క్రితం. అప్పటికి ఆయన వయసు 34 ఏళ్ళు. ఆయన బాబాయ్ సంజయ్ గాంధీ ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయకపోయినా పాతికేళ్ళకే రాజకీయంగా చురుకుగా ఉంటూ వచ్చారు. ఆయన 33 ఏళ్ళలోపే అమేధీ నుంచి ఎంపీగా అయ్యారు. అదే వయసులో ఆయన మరణించారు. లేకపోతే ఆయనే ఇందిరాగాంధీకి సిసలైన వారుసుడు అయి ఉండేవారు అని అంటారు. మరో వైపు చూస్తే సంజయ్ మరణించిన తరువాత్ రాజీవ్ గాంధీ రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన 1981లో కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చేరి ఆ వెంటనే అమేధీ ఉప ఎన్నికల్లో పోటీ చేసి ఎంపీ అయ్యారు. రాజీవ్ గాంధీ ఎంపీ అయ్యేనాటికి వయసు 36 ఏళ్ళు. అయితే రాజీవ్ గాంధీ నలభయ్యేళ్ళకే దేశానికి ప్రధాని అయి సరికొత్త రికార్డుని క్రియేట్ చేశారు. ఆ రికార్డు ఎవరూ బద్ధలు కొట్టలేదు. దానికి రాహుల్ గాంధీకి అవకాశం ఉన్నా ఆయన ప్రధాని కాలేదు. ఎందుకంటే 34 ఏళ్లకే ఎంపీ అయిన రాహుల్ యూపీయే వన్ టూ లో కేవలం సాధారణ పార్లమెంట్ మెంబర్ గానే పనిచేశారు. ఆయన తలచుకుంటే 2009లో రెండవ టెర్మ్ లో ప్రధాని అయ్యేవారు. అలా 39 ఏళ్లకే ప్రధాని అయ్యే అవకాశాన్ని తోసిపుచ్చినందుకు రాహుల్ మరో రెండు దశాబ్దాలు నిరీక్షించాల్సి వస్తోంది. అదే విధంగా చూస్తే 2014లో రాహుల్ గాంధీ కాంగ్రెస్ తరఫున విపక్షంలో ఉన్నారు. 2019లో అధికారంలోకి వస్తామనుకున్నా రాలేకపోయారు 2024లో అయితే దాదాపుగా దగ్గరగా వచ్చేశారు. ఇపుడు చూస్తే తాజా ఉప ఎన్నికల్లో ఇండియా కూటమి మొత్తం మోత మోగించింది. దాంతో దేశమంతా ఇండియా కూటమి గాలి వీస్తోంది. ఇక మీదట ఏ ఎన్నికలు జరిగినా పూర్తి ఆత్మ విశ్వాసంతో ఇండియా కూటమి ఎన్నికల్లో పాలు పంచుకోవడానికి ఆస్కారం ఏర్పడింది. రాహుల్ గాంధీ పార్లమెంట్ లో ప్రధాన ప్రతిపక్ష నేతగా ఎంపిక అయ్యారు. కొత్త పార్లమెంట్ లో రాహుల్ గాంధీ చేసిన తొలి ప్రసంగానికి మంచి స్పందన లభించింది. ఈ నెల 22 నుంచి ప్రారంభం కాబోతున్న బడ్జెట్ సమావేశాలలో రాహుల్ గాంధీ రెట్టించిన ఉత్సాహంతో కనిపించనున్నారు అని అంటున్నారు. దేశంలో ప్రజల మూడ్ ఏంటో ఉప ఎన్నికల ఫలితాలు వెల్లడించినందువల్ల రాహుల్ గాంధీ మోడీ సర్కార్ ని టార్గెట్ చేసుకుంటారు అని అంటున్నారు. ఈ బడ్జెట్ సమావేశాలలో రాహుల్ ని తట్టుకోవడం అధికార ఎన్డీయే కూటమికి బహు కష్టమని అంటున్నారు. అదే విధంగా చూసెతే కనుక రానున్న కాలంలో అధికార పార్టీకి ఇబ్బందులు అన్ని వైపుల నుంచి తప్పవని అంటున్నారు. ఇక రాహుల్ గాంధీ విషయం తీసుకుంటే ఆయనకు రాజకీయంగా ఇప్పటి దాకా కాలం కలిసి రాలేదు అని అంటున్నారు. ఇపుడు చూస్తే అదంతా పోయింది అని అంటున్నారు. రానున్న రోజులు అన్నీ రాహుల్ గాంధీకి మంచి రోజులే అని అంటున్నారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ పెద్ద పార్టీ. వంద దాకా ఎంపీలు ఉన్న పార్టీ. రానున్న కాలంలో గుజరాత్ ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ హిమాచల్ ప్రదేశ్, అసోం వంటి రాష్ట్రాలలో బీజేపీతో ముఖా ముఖీ తలపడే సత్తా కాంగ్రెస్ కే ఉందని అంటున్నారు. దాంతో పాటు భారత్ జోడో యాత్రను రెండు విడతలుగా చేసి రాహుల్ కాంగ్రెస్ గ్రాఫ్ పెంచారు. దాంతో పాటు తన గ్రాఫ్ ని పొలిటికల్ ఇమేజ్ ని కూడా పెంచుకున్నారు. రాహుల్ పాదయాత్ర ఫలితంగా ఉత్తరాదిన రాజకీయ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది అని అంటున్నారు. రాహుల్ లోని నాయకత్వ లక్షణాలను ఇపుడు జనాలు గుర్తించారు. అలాగే కాంగ్రెస్ మిత్రులు కూడా గుర్తించారు అని అంటున్నారు. దానికి ఉదాహరణ రెండవ మాట లేకుండా ఆయనకే ప్రధాన ప్రతిపక్ష స్థానం అప్పగించే విషయంలో ఇండియా కూటమి సహకరించడం. ఒక విధంగా వెయిటింగ్ ప్రైమ్ మినిస్టర్ గా రాహుల్ గాంధీ ఉన్నారు.

రానున్న కాలంలో రాహుల్ తన దూకుడుని మరింతగా పెంచుతారని అంటున్నారు. ఈ అయిదేళ్ళ కాలం మోడీ సర్కార్ పాలిస్తే అది అద్భుతమే అవుతుందని ఇండియా కూటమి అంటోంది. ఈ మధ్యలో ఏమైనా ఇబ్బందులు వస్తే ఈ టెర్మ్ లోనే రాహుల్ ప్రధాని అయినా ఆశ్చర్యం లేదు అని అంటున్నారు. మొత్తానికి రాహుల్ అయిదున్నర పదుల వయసులో దేశానికి ప్రధాని అవుతారా అన్నదే ఢిల్లీ వర్గాలలో కొత్త చర్చగా ఉంది అంటున్నారు.

# ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలి



శామీర్ పేట, (గరుడ వార్త) : ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు తెలిపారు. మంగళవారం శామీర్ పేట మండలం తూముకుంట మున్సిపల్ పోతాయిపల్లిలోని ప్రభుత్వ పార్కులో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఇట్టి కార్యక్రమము ప్రతి ఒక్కరు పర్యావరణం పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అత్యధికంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేటి మొక్కలే భవిష్యత్ తరాలకు వృక్షాలుగా మారి ప్రాణవాయువుని అందిస్తుందని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ మాట్లాడుతూ వన మొహత్సవం కార్యక్రమములో భాగముగా తూంకుంట మున్సిపాలిటీకి రాష్ట్ర ప్రభుత్వము నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఇందులో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి కాలనీలా రోడ్లు, పార్కులు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. ఇంటింటికి 6 మొక్కల పంపిణి చేయాలని చెప్పారు. ఈ వన మహోత్సవంలో భాగంగా ప్రతి రోజు 16 వార్డులలో చైర్ పర్సన్, కౌన్సిల్ సభ్యుల సమక్షములో వన మహోత్సవం కార్యక్రమము చేపడతామని తెలియజేశారు. ఈ కార్యక్రములో మున్సిపల్ ప్రజలు తమ వంతు భాద్యతగా మొక్కలు నాటే కార్యక్రమములో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమములో కౌన్సిలర్లు హరి బాబు, నర్సింగ్ రావు గౌడ్, కో- ఆప్షన్ సభ్యులు మిర్జా షఫీ ఉల్ల బైగ్, మున్సిపల్ మేనేజర్ శ్రవణ్ కుమార్, ఆర్ ఐ



భాస్కర్. వార్డు ఆఫీసర్లు. బిల్ కలెక్టర్లు, జవాన్లు, హరిత హారం సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ పై సైబరాబాద్ పోలీసులకు అవగాహన సదస్సు...

### డ్రగ్స్ రహిత సమాజం పై సైబరాబాద్ పోలీసుల అవగాహన సదస్సు....

### -యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి : డీసీపీ సృజన








క్రైమ్ బ్యూరో (గరుడ వార్త) :మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్ నాశనమవుతుందని, మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాలని సైబరాబాద్ విమెన్ అండ్ చిల్డ్రన్ సేఫ్టీ వింగ్ (%W& CSW%) డీసీపీ సృజన కర్ణం అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్‌లోని మెయిన్ కాన్ఫరెన్స్ హల్లో ఈరోజు మాదకద్రవ్య వినియోగంపై సైబరాబాద్ పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ సృజన మాట్లాడుతూ.. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్ నాశనమవుతుందన్నారు. ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. డ్రగ్స్ సరఫరా చేసేవారి ఆట కట్టించడానికి పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉన్నామన్నారు. డ్రగ్స్కు సంబంధించిన ఫిర్యాదుల కోసం 87126 71111 కి కాల్ చేయండి. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. అమృత ఫౌండేషన్ %NGO% డైరెక్టర్ మరియు పరిశోధక సైకాలజిస్ట్ దేవికా రాణి కూడా ఈ సమస్యను ఉటంకిస్తూ, "యువతులు మత్తుపదార్థాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. మాదకద్రవ్యాల వినియోగం వారి భవిష్యత్తులను అంధకారంగా మారుస్తుంది, వారు ఇలాంటి పదార్థాలకు దూరంగా ఉండాలి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ ఉమెన్ %ಡ% చైల్డ్ సేఫ్టీ డీసీపీ సృజన కర్ణం, అమృత ఫౌండేషన్ ఎన్‌జిఓ డైరెక్టర్ మరియు పరిశోధక సైకాలజిస్ట్ దేవికా రాణి, %W& CSW% ఏసీపీ ప్రసన్న కుమార్, ఇన్ స్పెక్టర్ సునీత, %AHTU% ఇన్ స్పెక్టర్ జేమ్స్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# బాలలూ.. మీకెందుకు వాహనాలు

హైదరాబాద్: మద్యం తాగి కారు నడిపి ఇద్దరు టెకీల మరణానికి కారణమైన పుణెకు చెందిన మైనర్ ఉదంతం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో గ్రేటర్‌లో ఆందోళన వ్యక్తమవుతోంది. నగరంలోనూ మైనర్లు విచ్చలవిడిగా కార్లు, బైకులు నడుపుతున్నారు. తల్లిదండ్రులు వారించక కేసుల్లో ఇరుక్కుంటున్నారు. పుణెలో 12వ తరగతి విద్యార్థి మద్యం తాగి కారు అతివేగంగా నడిపి బైక్‌పై వెళుతున్న ఇద్దరు టెకీలను ఢీకొనడటంతో వారు మృతిచెందగా మైనర్‌కు వెంటనే బెయిల్ రావడంతో మృతుల కుటుంబికులు ఆందోళనకు దిగారు. మైనర్‌కు కారు ఇచ్చినందుకు, మద్యం సరఫరా చేసినందుకు తండ్రితోపాటు బార్ యజమానులను అరెస్టు చేసినా ఆందోళన ఆగడం లేదు. 18 ఏళ్లు నిండిన తర్వాతే డ్రైవింగ్ నేర్చుకొని లైసెన్సు పొందిన తర్వాతే కారు లేదా ద్విచక్ర వాహనాలు నడిపేందుకు అర్హత వస్తుంది. నగరంలో పదోతరగతి, ఇంటర్ చదివేవారే డ్రైవింగ్ చేస్తున్నారు. తల్లిదండ్రులకు తెలిసి కొందరు, తెలియక కొందరు వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారు. డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడం, నిబంధనలు గురించి తెలియక ప్రమాదాలకు కారణమవుతున్నారు.

దొరికితే ఇబ్బందే..

మైనర్లు వాహనాలు నడపటం చట్టరీత్యా నేరం. పెద్దలు అభ్యంతరం చెప్పకపోవడం కూడా నేరమే. అలా చేస్తే వాహన యజమాని శిక్షార్హుడు. ముఖ్యంగా యువత, ఉద్యోగులకు జైలుశిక్ష పడితే వారి కెరీర్‌పై ప్రభావం చూపుతుంది. నగరంలో జరుగుతున్న తనిఖీల్లో 20-30 శాతం మందికి డ్రైవింగ్ లైసెన్సులు ఉండటం లేదు. కొందరు లైసెన్సులు గడువు తీరినా పునరుద్ధరించుకోవడం లేదు.

**శిక్షణే రక్షణ..** కారు లేదా బైకు నడపాలంటే శిక్షణ తప్పనిసరి. డ్రైవింగ్ శిక్షణ స్కూలు పకడ్బందీగా ఉండాలి. కంప్యూటర్ ఆధారిత నమూనా కారులాంటి యంత్రం (సిమ్యులేటర్) తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. యాక్సిలరేటర్, బ్రేక్, క్లచ్‌పై అవగాహన కల్పిస్తారు. 1 నుంచి 5 వరకు గేర్లు ఎలా మార్చాలి.. ఎక్కడ ఏ గేరు వాడాలి.. పూర్తిగా గేర్లు మార్చే విధానంపై శిక్షణ ఉంటుంది.

వాహనం ఎత్తుగా ఉన్న ప్రాంతానికి వెళ్లేటప్పుడు, పల్లపు ప్రాంతానికి దిగేటప్పుడు ఏం చేయాలి.. ఎడమ, కుడి మలుపులు, యుటర్న్‌లు తీసుకునేప్పుడు జాగ్రత్తలు చెబుతారు.

ఇక రహదారులపై ట్రాఫిక్‌లో నడిపే విధానం.. ఓవర్ టేకింగ్.. సిగ్నళ్ల వద్ద నిలిచే విధానం.. ఏ గేరులో ఉండాలి.. ఎలా ముందుకు వెళ్లాలనే అంశాలను సిమ్యులేటర్‌పై శిక్షకుడు వివరిస్తారు.

వర్షం, మంచు కురుస్తున్న సమయంలో డ్రైవింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు.. ఏ లైట్లు వినియోగించాలో నేర్పిస్తారు. స్టీరింగ్ పట్టుకునే విధానం.. దానిని ఉపయోగించే తీరుపై సిమ్యులేటర్‌పై నేర్చుకోవచ్చు. ట్రాఫిక్ నిబంధనలు.. సూచనలు.. ఆర్టీఏ చట్టాలు.. వాటిని ఉల్లంఘిస్తే విధించే జరిమానాలు గురించి వివరిస్తారు.

శిక్షణకు ముందు సంబంధిత ఆర్టీఏ కార్యాలయంలో ఎల్‌ఎల్‌ఆర్ తీసుకోవాలి. అది ఉంటేనే శిక్షణ వాహనం నడపేందుకు అవకాశం ఉంటుంది. శిక్షణ పూర్తి అయిన తర్వాత ధ్రువపత్రం ఇస్తారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా అన్న ప్రసాద వితరణ

శామీర్ పేట, (గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తూముకుంట కు చెందిన సత్తన్నపల్లి సాత్విక్ గణేష్ జన్మదినం సందర్భంగా తల్లిదండ్రులు రమేష్- సంధ్యారాణి దంపతులు, వారి కుటుంబ సభ్యులు అన్నదానం చేపట్టారు. అలాగే కుషాయిగూడకు చెందిన ఉడుతల భాస్కర్ గౌడ్





జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు, గుంటకు చెందిన మేస్త్రిరి నరసింహ గౌడ్ అన్నదానానికి ఆర్థిక సాయం చేశారు. శామీర్ పేట కు చెందిన భక్తులు భజన చేస్తూ భక్తి గీతాలు ఆలపించారు. వివిధ గ్రామాల భక్తులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రాజీవ్ రహదారి పై వెళ్లే భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# ప్రభుత్వ భూములను పర్యవేక్షించాలి....

హలో జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త)మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని ప్రతి మండలం లో ఉన్న ప్రభుత్వ భూములను అన్యకాంతం కాకుండా చూడాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజున జె సి ఛాంబర్ లో సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రతి మండలంలో సర్వే ల్యాండ్ కింద పెండింగ్ ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూములను పర్యవేక్షించే బాధ్యత మీపై ఉందన్నారు. ప్రతి మండలంలో ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించాలన్నారు. సెంటు భూమిని కూడా అన్యకాంతం కాకుండా చూడాలని సర్వేలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్వే లాంటి రికార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ ,డిప్యూటీ ఇన్స్పెక్టర్, సర్వేయర్ లు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పల్లెప్రగతి పనులెలా ఉన్నాయి

పెద్దపల్లి : స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా గత ప్రభుత్వం ఊరికో పల్లె ప్రకృతివనం, శ్మశానవాటిక, క్రీడా ప్రాంగణం, సెగ్రిగేషన్ షెడ్డు, నర్సరీలను ఏర్పాటు చేసింది. వీటిని పల్లె ప్రగతిలో ప్రాధాన్య పనులుగా గుర్తించి ఉపాధిహామీ నిధులను అనుసంధానించారు. దాదాపు మూడేళ్ల కిందట యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాలు చేపట్టారు. అయితే రూ.కోట్లు వెచ్చించినా ప్రభుత్వ ఆశయం నెరవేరలేదు. చాలా చోట్ల పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో పాటు వినియోగానికి దూరంగా ఉన్నాయి. ఈ క్రమంలో పల్లె ప్రగతి పనుల వాస్తవ పరిస్థితిని నివేదించాలని ప్రభుత్వం నుంచి అధికారులకు మౌఖిక ఆదేశాలందాయి. వారు క్షేత్ర స్థాయికి వెళ్లి ఆరా తీస్తున్నారు.

సమగ్ర వివరాల సేకరణ

గ్రామాల్లో కార్యదర్శులు, ఎంపీవోలు క్షేత్ర స్థాయిలో వివరాలు సేకరిస్తున్నారు. శ్మశానవాటికలో నీరు, విద్యుత్తు వసతులు ఉన్నాయా? మూత్రశాలలు అందుబాటులో ఉన్నాయా? పల్లె ప్రకృతివనాల్లో నాటిన మొక్కల్లో ఎన్ని బతికాయి? నీటి తడులు అందిస్తున్నారా? నిర్వహణ ఎలా ఉంది? క్రీడా మైదానాల్లో సామగ్రి పంపిణీ చేశారా? మైదానంలో గడ్డి, హరితహారం నర్సరీల్లో మొక్కల పెంపకం ఎలా ఉంది? విత్తనాలు నాటారా? ఎన్ని మొక్కలు నాటేందుకు సిద్ధం చేశారు? నీటి తడులు అందిస్తున్నారా? సెగ్రిగేషన్ షెడ్డులో తడి, పొడి చెత్త సేకరణ ఎలా ఉంది? వేర్వేరుగా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారా? ఎంత ఆదాయం సమకూరింది? తదితర అంశాలతో వివరాలు సేకరిస్తున్నారు.

మనుగడలోకి వస్తేనే ప్రయోజనం

ఉమ్మడి జిల్లాలో శ్మశాన వాటికలు, క్రీడా మైదానాలు, సెగ్రిగేషన్ షెడ్లు, పల్లె ప్రకృతివనాలు, నర్సరీలు ఏర్పాటు చేయగా నర్సరీలు తప్ప మిగిలినవి ఎక్కడా మనుగడలో లేవు. ఉమ్మడి జిల్లాలో 1,200 సెగ్రిగేషన్ షెడ్లు, 1,172 డంపింగ్ యార్డులు, 1,314 నర్సరీలు, 1,185 క్రీడా ప్రాంగణాలు, 1,214 పల్లె ప్రకృతివనాలు ఉన్నాయి. అధికారులు వివరాలు సేకరించిన అనంతరమైనా వాటిని మనుగడలోకి తీసుకొస్తే ప్రయోజనం ఉంటుంది.




# అన్నా క్యాంటీన్ల ఏర్పాటుపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి కీలక ప్రకటన

అమరావతి, జూలై 16: అన్నా క్యాంటీన్ల ఏర్పాటుపై మంత్రి రాంప్రసాద్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఆగస్టు 15 నుంచి అన్నా క్యాంటీన్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఒక్కో నిర్ణయం దశల వారీగా తీసుకుంటామని వెల్లడించారు. మహిళలకు ఉచిత బస్ విధానంపై అధ్యయనం చేశామన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

**22నుంచే అసెంబ్లీ సమావేశాలు :** మరోవైపు అసెంబ్లీ సమావేశాలపై కేబినెట్ భేటీలో చర్చ జరిగింది. ఈ నెల 22 నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. ఓటాన్ అకౌంట్ పెట్టాలా..? లేక ఆర్డినెన్స్ పెట్టాలా..? అనే అంశంపై కేబినెట్‌లో చర్చించినట్లు తెలుస్తోంది. మూడు రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. గవర్నర్ ప్రసంగంతో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభంకానున్నాయి. శ్వేత పత్రాలు ప్రస్తావనను అసెంబ్లీలో తేవాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు.

# కోటప్పకొండ గిరి ప్రదక్షిణ కోసం అన్ని ఏర్పాట్లు సిద్ధం

పల్నాడు జిల్లా: కోటప్పకొండ గిరి ప్రదర్శనకు విచ్చేసే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశామని ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు తెలిపారు. నరసరావుపేట మున్సిపల్ గెస్ట్ హౌస్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

కోటప్పకొండలో రేపు(బుధవారం) జరగబోయే గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా అరవింద బాబు మాట్లాడుతూ..... రేపు తొలి ఏకాదశికి కోటప్పకొండలో అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. తొలి ఏకాదశికి అందరూ శానిటేషన్ అధికారులు పాల్గొంటారని అన్నారు. కోటప్పకొండకి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు కాబట్టి వాళ్లకి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అధికారులు ముందుగానే తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. పల్నాడు జిల్లాలో ఆరు సెగ్మెంట్‌లలో డయేరియా, మలేరియా కేసులు ఇటీవల ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. డయేరియా, మలేరియా రాకుండా



నరసరావుపేట డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని అన్నారు. నరసరావుపేట పరిశుభ్రతే ధ్యేయంగా అధికారులు పని చేయాలని ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు సూచించారు.




వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష రేసులో ఉన్న డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నంతో ప్రపంచమంతా ఒక్కసారిగా షాక్‌కు గురైన విషయం తెలిసిందే. అయితే ఆయన ప్రాణాలతో బయటపడటానికి పూరీ జగన్నాథుడి కృపే కారణమని అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం వ్యాఖ్యానించింది. రథయాత్రతో ట్రంప్‌నకు ఉన్న అనుబంధాన్ని ఈసందర్భంగా వెల్లడించింది. "ఇది కచ్చితంగా జగన్నాథుడి కృపే. 48 ఏళ్ల క్రితం రథయాత్రకు ట్రంప్ సహకారం అందించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా రథయాత్ర ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సమయంలోనే ఆయనపై హత్యాయత్నం జరిగింది. ఆ భగవంతుడి అనుగ్రహమే ఆయన్ను రక్షించింది" అని ఇస్కాన్ ప్రతినిధి రాధారమణ్ దాస్ అభిప్రాయపడ్డారు. 1976లో ఇస్కాన్ భక్తులు రథయాత్ర కోసం రథాలు సిద్ధం చేసుకునేందుకు ఉచితంగా తన ట్రైన్‌యార్డ్‌ను ఇచ్చి సహకరించారని చెప్పారు. ఇదిలా ఉంటే.. పెన్సిల్వేనియాలోని బట్లర్ పట్టణంలో ఎన్నికల ప్రచారంలో ట్రంప్ మాట్లాడుతుండగా ఓ యువకుడు కాల్పులు జరపడంతో ఆయన చెవికి తీవ్ర గాయమైంది. తృటిలో ఆయన మృత్యువు నుంచి తప్పించుకున్నారు. ఈ ఘటన జరిగిన సమయంలో సభలో ఉన్న ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. రక్తమోడుతున్న గాయంతో ఒక్కక్షణం నిర్ఘాంతపోయిన ట్రంప్ చుట్టూ వెంటనే భద్రతా బలగాలు వలయంగా ఏర్పడ్డాయి. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లలో కొందరు ఆయన్ను అక్కడినుంచి సురక్షిత ప్రదేశానికి తరలించగా, అదే సమయంలో మరికొందరు దుండగుడిపై కాల్పులు జరిపి హతమార్చారు. ఒడిశాలోని పూరీలో విశ్వప్రసిద్ధ జగన్నాథుడి రథయాత్ర జులై 7న వైభవోపేతంగా ప్రారంభమైంది. జగన్నాథుడు, బలభద్ర, సుభద్ర..ఈ ముగ్గురు మూర్తులు రథాలపై పెంచిన తల్లి గుండిచాదేవి ఆలయానికి చేరుకున్నారు. నేడు తిరుగు రథయాత్ర జరుగుతుంది. ఈ వేడుకను బహుడా యాత్రగా పేర్కొంటారు. ఈ ఉత్సవంలో 7 నుంచి 8 లక్షల మంది భక్తులు పాల్గొంటారన్న అంచనాతో యంత్రాంగం గట్టి బందోబస్తు చేసింది. 82 ప్లాటూన్ల పోలీసు బలగాలను నియమించింది. రథయాత్ర మాదిరిగా బహుడా వేడుకకు పూరీలో మూడంచెల భద్రత కల్పిస్తున్నామని, తొక్కిసలాట జరగకుండా పోహండి, రథాలు లాగే సమయంలో ప్రత్యేక బలగాలను నియమించినట్లు అధికారులు తెలిపారు.




అమెరికా మాజీ అధ్యక్షుడు ట్రంప్‌పై హత్యాయత్నం యావత్ ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఈ ఘటనకు పాల్పడిన దుండగుడిని సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు మట్టుబెట్టారు. నిందితుడిని 20 ఏళ్ల థామస్ మాథ్యూ క్రూక్స్‌గా గుర్తించిన ఎఫ్‌బీఐ తాజాగా అతడి ఫొటోను విడుదల చేసింది. కాగా.. అతడు గతంలో ఓ ఇన్వెస్ట్‌మెంట్ దిగ్గజ కంపెనీ రూపొందించిన ప్రకటనలో నటించినట్లు తెలిసింది. తాజా ఘటనతో ఆ యాడ్‌ను సదరు సంస్థ తొలగించింది. ప్రపంచ అతిపెద్ద మనీ మేనేజింగ్ సంస్థ 'బ్లాక్ రాక్ (%దీశ్రీఖఎనె=శీఎనె%)' 2022లో ఓ యాడ్ రూపొందించింది. పెన్సిల్వేనియాలోని బెతెల్ పార్క్ హైస్కూల్‌లో దాన్ని షూట్ చేశారు. అందులో ఆ స్కూల్‌కు చెందిన కొందరు విద్యార్థులు నటించగా.. వారిలో క్రూక్స్ కూడా ఉన్నాడు. ట్రంప్‌పై కాల్పుల ఘటన తర్వాత ఈ యాడ్ సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. దీంతో కంపెనీ సదరు ప్రకటనను తమ వెబ్‌సైట్ నుంచి తొలగించింది. అయితే, అధికారులకు వీడియో అందుబాటులో ఉంటుందని బ్లాక్ రాక్ తెలిపింది. ఈ బెతెల్ పార్క్ స్కూల్ నుంచి క్రూక్స్ 2022లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. స్కూల్లో ఉండగా.. గణితంలో అతడు చురుగ్గా ఉండేవాడని సమాచారం. నేషనల్ మ్యాథ్స్ అండ్ సైన్స్ ఇనీషియేటివ్ నుంచి అతడు 500 డాలర్ల 'స్టార్ అవార్డు' కూడా అందుకున్నట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత నుంచి ఓ నర్సింగ్ హోంలో పనిచేస్తున్నాడు.

**స్కూల్లో వేధింపులు..** కాగా.. స్కూల్లో ఉన్నప్పుడు క్రూక్స్ తోటి విద్యార్థుల నుంచి వేధింపులు ఎదుర్కొన్నాడని అతడి మాజీ క్లాస్‌మేట్ ఒకరు మీడియాకు తెలిపారు. "అతడు ఎప్పుడూ మౌనంగా ఉండేవాడు. ఎవరితో కలవకుండా ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడేవాడు. రాజకీయాల గురించి గానీ, ట్రంప్ గురించి గానీ మాట్లాడటం నేనెప్పుడూ వినలేదు. అయితే, స్కూల్లో కొంతమంది అతడిని చాలా వేధించారు. అతడు వేసుకునే దుస్తులను చూసి గేలి చేసేవారు" అని ఆ క్లాస్‌మేట్ చెప్పారు.

**దుండగుడి ఫొటో విడుదల..** కాల్పుల ఘటనపై దర్యాప్తు చేపట్టిన ఎఫ్‌బీఐ తాజాగా దుండగుడి ఫొటోను విడుదల చేసింది. అందులో క్రూక్స్ కళ్లద్దాలు పెట్టుకొని నవ్వుతూ కన్పించాడు. మాజీ అధ్యక్షుడిపై కాల్పులు జరపగా.. సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు అతడిని హతమార్చిన సంగతి తెలిసిందే. క్రూక్స్ ఫొటోను ఎఫ్‌బీఐ విడుదల చేయడానికి ముందే అతడికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మరోవైపు కాల్పులకు ముందు అతడు రికార్డు చేసినదిగా పేర్కొంటున్న ఓ వీడియో కూడా సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. అందులో 'రిపబ్లికన్ పార్టీని, ట్రంప్‌ను నేను ద్వేషిస్తున్నా'నని అతడు చెబుతున్నట్లుగా ఉంది. క్రూక్స్ పెన్సిల్వేనియాలోని బెతెల్ పార్క్‌కు చెందిన వ్యక్తిగా తెలిపింది. ప్రభుత్వ ఓటింగ్ రికార్డుల ప్రకారం.. అతడు రిపబ్లికన్ పార్టీ మద్దతుదారుగా నమోదు చేసుకున్నాడు. కానీ, అతడు 2021 సంవత్సరంలో 15 డాలర్లను డెమోక్రాట్లకు అనుబంధంగా పనిచేసే ప్రొగ్రెసివ్ టర్న్‌ఔట్ ప్రాజెక్టుకు విరాళంగా ఇచ్చాడు.




# పుతిన్‌కు మీరైనా చెప్పండి.. భారత్‌కు అమెరికా విజ్ఞప్తి!

వాషింగ్టన్: రష్యా, ఉక్రెయిన్ మధ్య కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు లభించేలా కృషి చేయాలని భారత్‌కు అమెరికా విజ్ఞప్తి చేసింది. రష్యాతో ఉన్న దీర్ఘకాల బంధాన్ని అందుకు ఉపయోగించుకోవాలని హితవు పలికింది. 'చట్టవిరుద్ధమైన' ఈ యుద్ధానికి ముగింపు పలికేలా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడాలని కోరింది. అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి మాథ్యూ మిల్లర్ సోమవారం మీడియా సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. దిల్లీ-మాస్కోల మధ్య బలమైన సంబంధాలు ఉన్నట్లు గుర్తుచేశారు. ఐరాస చట్టాలను గౌరవించాలని పుతిన్‌కు సూచించాలని భారత్‌ను కోరారు. "రష్యాతో భారత్‌కు సుదీర్ఘ బంధం ఉంది. ఇది అందరికీ తెలిసిందే. దాన్ని ఉపయోగించుకోవాలని భారతదేశాన్ని అమెరికా ప్రోత్సహిస్తోంది. రష్యాతో పటిష్ఠ బంధం, దానివద్ద ఉన్న విశిష్ట స్థానాన్ని ఉపయోగించుకొని అధ్యక్షుడు పుతిన్‌తో మాట్లాడాలని కోరుతున్నాం. చట్టవిరుద్ధమైన యుద్ధాన్ని ముగించి శాంతి స్థాపనకు కృషి చేయాలని ఆయనకు చెప్పమని విజ్ఞప్తి చేస్తున్నాం. ఐరాస నిబంధనలను గౌరవించాలని, ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమత్వాన్ని గౌరవించాలని సూచించమని చెబుతున్నాం" అని మాథ్యూ మిల్లర్ అన్నారు. భారత్‌తో తమకూ సత్సంబంధాలు ఉన్నాయని.. అందుకే ఈ విషయంపై నిరంతరాయంగా ఒత్తిడి తెస్తున్నామని తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల రష్యా పర్యటనకు వెళ్లిన విషయం తెలిసిందే. పలు ద్వైపాక్షిక అంశాలపై ఆయన పుతిన్‌తో చర్చలు జరిపారు. తొమ్మిది కీలక రంగాల్లో సహకారానికి ఒప్పందానికి అంగీకారం తెలిపారు. 2030 నాటికి రెండు దేశాల మధ్య 100 బిలియన్ డాలర్ల వాణిజ్యం లక్ష్యంగా నిర్ణయించారు. మరోవైపు మోదీకి రష్యా అత్యున్నత పౌర పురస్కారాన్ని పుతిన్ అందజేశారు. శిఖరాగ్ర చర్చల సందర్భంగా రష్యా, ఉక్రెయిన్ యుద్ధంపై మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బాంబులు, తుపాకులు, బుల్లెట్లు శాంతి చర్చలను సఫలం చేయలేవని స్పష్టంచేశారు. అదే సమయంలో ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని పరిష్కరించడంలో సహకరిస్తున్న మోదీకి పుతిన్ కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు మోదీ పర్యటనపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పెదవి విరిచారు. శాంతి స్థాపనకు విఘాతం కలిగించే చర్య అంటూ అవగాహనారాహిత్య వ్యాఖ్యలు చేశారు.




దిల్లీ: దేశ రాజధాని దిల్లీ సరిహద్దులో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. పంజాబ్-హరియాణా సరిహద్దులోని శంభూ ప్రాంతంలో జాతీయ రహదారిపై ఏర్పాటుచేసిన అడ్డుకట్టల్ని తొలగించగానే.. దిల్లీకి ర్యాలీ చేపట్టే యోచనలో ఉన్నట్లు భారతీయ కిసాన్ యూనియన్ నేతలు చెబుతున్నారు. జంతర్‌మంతర్‌లో గానీ, రామ్‌లీలా మైదానంలో గానీ శాంతియుత నిరసనకు దిగుతామన్నారు. ఈసారి తమను అడ్డుకున్నా, రహదారిపై బారికేడ్లు ఏర్పాటుచేసినా.. హరియాణా ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీకేయూ స్పష్టం చేసింది. పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంతోపాటు వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కేంద్రానికి వ్యతిరేకంగా రైతులు గత కొన్నాళ్లుగా నిరసన చేపడుతున్న విషయం తెలిసిందే. ఉద్యమంలో భాగంగా ఫిబ్రవరిలో రైతులు చేపట్టిన 'చలో దిల్లీ' కార్యక్రమాన్ని భద్రతా బలగాలు అడ్డుకోవడంతో ఘర్షణ తలెత్తింది. అప్పటినుంచి హరియాణా సరిహద్దులోనే శిబిరాలను ఏర్పాటు చేసుకొని రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఘర్షణల నేపథ్యంలో శింబు సరిహద్దు వద్ద అధికారులు రోడ్డును మూసివేసి, రాకపోకలు నిలిపివేశారు. దీనిపై విచారణ చేపట్టిన పంజాబ్- హరియాణా హైకోర్టు.. ప్రయాణికుల ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకొని రహదారిపై ఏర్పాటుచేసిన అడ్డంకుల్ని తొలగించాలని ఆదేశించింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ హరియాణా ప్రభుత్వం.. సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం.. జాతీయ రహదారుల్ని దిగ్బంధించే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు లేదంటూ.. అడ్డంకుల్ని తొలగించాలని నాలుగు రోజుల క్రితం తీర్పునిచ్చింది. ఈనేపథ్యంలో రోడ్డుపై అడ్డంకుల్ని తొలగించడం అనివార్యమైంది. ఈ క్రమంలో దిల్లీకి మరోసారి ర్యాలీ చేపట్టేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. మరోవైపు మార్చిలో ఆందోళనలు నిర్వహించిన సమయంలో అరెస్టయిన నవ్‌దీప్‌సింగ్‌కు సంఘీభావంగా బుధ, గురువారం అంబాలాలో శాంతియుత నిరసన చేపట్టనున్నట్లు భారతీయ కిసాన్ యూనియన్ ప్రకటించింది. ఫిబ్రవరిలో రైతులు, భద్రతా బలగాల మధ్య తలెత్తిన ఘర్షణల్లో శుభ్‌కరణ్ సింగ్ అనే యువ రైతు ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఒక వేళ రైతులు మళ్లీ 'చలో దిల్లీ'కి పిలుపునిస్తే.. పరిస్థితులు ఉద్రిక్తంగా మారే అవకాశం ఉంది.

# రండి సమస్యలు చెప్పుకోండి... టీడీపీ శ్రేణులకు ముఖ్య గమనిక




అమరావతి: ప్రజా సమస్యలపై ఏపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, తెలుగుదేశం నేతలు వినతులు స్వీకరించనున్నారు. రేపటి(బుధవారం) నుంచి ప్రతిరోజు పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయనున్నారు. ఈమేరకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. పార్టీ కార్యాలయంలో తప్పనిసరిగా మంత్రులు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తెలుగుదేశం పార్టీ శ్రేణుల ,ప్రజల కోసం కేంద్ర కార్యాలయంలో మంత్రులు అందుబాటులో ఉండనున్నారు. 10 రోజులు పాటు రోజుకో మంత్రి , ఒక సీనియర్ టీడీపీ నేత అందుబాటులో ఉండే విధంగా అధిష్ఠానం కార్యాచరణ రూపొందించింది.

**వినతులు స్వీకరించనున్న మంత్రులు వీరే..** 17వ తేదీ..... ఎస్ సవిత, 18వ తేదీ.... ఎన్‌ఎండీ ఫరూక్, 22వ తేదీ.. గుమ్మడి సంధ్యా రాణి, 23 వ తేదీ ..కొల్లు రవీంద్ర, 24 వ తేదీ- అనగాని సత్యప్రసాద్, 25వ తేదీ ..వాసంశెట్టి సుభాష్, 29వ తేదీ కొండపల్లి శ్రీనివాస్, 30 వ తేదీ.. మండపల్లి రాంప్రసాద్ రెడ్డి, 31 వ తేదీ- బి.సి. జనార్ధన్ రెడ్డి, 19, 26వ తేదీల్లో ఏపీ టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ వినతులు స్వీకరించనున్నారు.

**టీడీపీ కార్యాలయంలో అందుబాటులో ఉండనున్న జాతీయ నాయకులు** 17వ తేదీ బొల్లినేని రామారావు, 18వ తేదీ ..వైకుంఠం ప్రభాకర్ చౌదరి, 22.. వ తేదీ.. కావలి ప్రతిభ భారతి, 23 వ తేదీ ..శ్రీ కొట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, 24వ తేదీ.. శ్రీ బీద రవిచంద్ర, 25 వ తేదీ ..శ్రీ కె.ఎస్ జవహార్, 29వ తేదీ... పనబాక లక్ష్మి, 30వ తేదీ... శ్రీ కంభంపాటి రామ్మోహన్ రావు, 31 వ తేదీ...శ్రీమతి తోటా సీతారామ లక్ష్మి.

# పోలీసులపై హోంమంత్రి సీరియస్.. కారణమిదే..?

అమరావతి: బాధితులపైనే హత్య కేసు మోపిన గుంటూరు పోలీసులపై హోంమంత్రి వంగలపూడి అనిత సీరియస్ అయ్యారు. నల్లపాడు పోలీసు స్టేషన్‌లో పెట్టిన ఈ కేసును రీఓపెన్ చేసి విచారణ చేయాలని హోంమంత్రి ఆదేశించారు. తమ కుమార్తెను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు చేసేందుకు వెళ్తే హత్య కేసు పెట్టి ఖాకీలు వేధింపులకు గురిచేసిన సంఘటనపై ఫిర్యాదు చేశారు. నల్లపాడుకు చెందిన శంకరలీలా తన కుమార్తెను కిడ్నాప్ చేశారని నల్లపాడు పోలీసులకు గతంలో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన శంకర లీలాపై హత్య కేసు పెట్టి వేధింపులకు నల్లపాడు పోలీసులు గురిచేశారు. రెండు సంవత్సరాల క్రితం వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఈ సంఘటనపై ఈ రోజు సచివాలయంలో హోంమంత్రిని కలిసి శంకరలీలా చెప్పారు. తప్పుడు ఆరోపణలు చేసి ఖాకీలు వేధించారని ఆమె కన్నీటి పర్యంతం అయ్యారు. వెంటనే ఈ కేసును రీఓపెన్ చేసి



ఉన్నత స్థాయి విచారణ చేపట్టాలని హోంమంత్రి అనిత ఆదేశించారు. వెంటనే తనకు నివేదిక ఇవ్వాలని గుంటూరు పోలీసు ఉన్నతాధికారులకు హోం మంత్రి అనిత ఆదేశాలు జారీ చేశారు.

## పింక్ శారీలో సంయుక్త.. ఆహా ఏమి అందం!

హీరోయిన్ సంయుక్త మీనన్ కు టాలీవుడ్ లో ఎలాంటి క్రేజ్ ఉందో అందరికీ తెలిసిందే. తెలుగులో ఫస్ట్ సినిమా పవన్ కళ్యాణ్ తో చేసిన ఈ బ్యూటీ.. బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. భీమ్లా నాయక్ మూవీలో సంయుక్త తన అందం, అభినయంతో సినీ ప్రియులను తెగ మెప్పించింది. ఆ తర్వాత వరుస అవకాశాలు అందుకున్న సంయుక్త.. గోల్డెన్ బ్యూటీగా మారిపోయింది. అతి తక్కువ సమయంలోనే తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరైంది అమ్మడు. భీమ్లా నాయక్ తర్వాత తెలుగులో బింబిసార, సార్, విరూపాక్ష, డెవిల్ సినిమాలు చేసింది సంయుక్త. వాటిలో డెవిల్ మినహా మిగతా మూడు చిత్రాలు బ్లాక్ బస్టర్ హిట్లు అయ్యాయి. దీంతో బ్యూటీ క్రేజ్ ఓ రేంజ్ లో పెరిగిపోయింది. ప్రస్తుతం తెలుగులో యంగ్ హీరో నిఖిల్ స్వయంభులో నటిస్తోంది. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఫిమేల్ లీడ్ రోల్ చేస్తోంది. ఈ మూవీతో పాటు మాలీవుడ్ లో బిజీ బిజీగా గడుపుతోంది బ్యూటీ. ఇటీవల బాలీవుడ్ మూవీలో కూడా ఛాన్స్ కొట్టేసింది. స్పై ఫేమ్ చరణ్ తేజ్ ఉప్పాలపాటి దర్శకత్వం వహిస్తున్న మహారాగ్ని మూవీలో కీలక పాత్ర పోషిస్తోంది



సంయుక్త మీనన్. కొన్ని రోజుల క్రితం విడుదల అయిన గ్లింప్స్ లో కనిపించి ఆకట్టుకుంది. కారు రేసింగ్ లో గ్లామరస్ డ్రెస్? తో ఎంట్రీ ఇచ్చి ఫిదా చేసింది. అయితే సినిమాలతో బిజీగా ఉన్నా.. సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు సందడి చేస్తుంటోంది. తన ఫ్యాన్స్ కోసం డైలీ అప్డేట్స్ ఇస్తుంటోంది. చీరలతో పాటు మోడ్రన్ డ్రెస్సుల్లో ఫోటోలు దిగి పోస్ట్ చేస్తూ అలరిస్తుంటోంది. ఒక్కో ఔట్ ఫిట్ లో వేరే లెవెల్ పోజులిస్తుంటోంది. క్లాసీగా, డీసెంట్ గా తరచుగా గ్లామర్ షో చేస్తుంటోంది. అలా తన ఫాలోవర్స్ ను భారీగా పెంచుకుంటోంది. తాజాగా అదిరిపోయే పిక్స్ ను షేర్ చేసింది. పింక్ కలర్ ప్లెయిన్ శారీలో దిగిన ఫోటోలను పోస్ట్ చేసింది. స్లీవ్ లెస్ బ్లౌజ్ ను వేసుకున్న అమ్మడు.. క్రేజీ నెక్ సెట్ ను ధరించింది. స్టన్నింగ్ గా కనిపిస్తోంది. చీర పైటను కాస్త పక్కకు వేసుకుని ఎద అందాలతో కవ్విస్తోంది అమ్మడు. క్లాసీగా కనిపిస్తూనే సెగలు రేపుతోంది. నడుము మడతలు కనిపించేలా స్టిల్స్ ఇస్తూ హీట్ పుట్టిస్తోంది. ప్రస్తుతం సంయుక్తకు సంబంధించిన పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఫైర్ ఇమోజీలను కామెంట్స్ గా పెడుతున్నారు నెటిజన్లు. సో బ్యూటిఫుల్ అంటూ కొనియాడుతున్నారు. సంయుక్త గ్లామర్ కు ఫిదా అయ్యామని చెబుతున్నారు. మరి అమ్మడు అందాలను చూశారా?

## నిండైన అందాల మృణాల్

సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన మృణాల్ ఠాకూర్ ఏ స్థాయి విజయాన్ని సొంతం చేసుకుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ వెంటనే హాయ్ నాన్న సినిమాలో కూడా నటించడం ద్వారా టాలీవుడ్ లో మోస్ట్ వాంటెడ్ హీరోయిన్ గా మారింది. బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న మృణాల్ ఠాకూర్ మరో వైపు సోషల్ మీడియాలో ఇలాంటి కన్నుల విందు ఫోటోలను షేర్ చేయడం ద్వారా వైరల్ అవుతూ ఉంటుంది. తాజాగా మరోసారి అందాల మృణాల్ నిండైన అందాల ఫోటోలను షేర్ చేయడం ద్వారా



అందరి దృష్టిని ఆకర్షించింది. సాధారణంగా హీరోయిన్స్ స్కిన్ షో చేస్తేనే సోషల్ మీడియాలో వైరల్ అవుతారు. కానీ మృణాల్ ఇలా నిండుగా కప్పుకున్న ఫోటో షూట్ ని షేర్ చేసినా కూడా వైరల్ అవుతుంది. ఆ ఫేస్ లో అందం కొట్టొచ్చినట్లుగా ఉందని, నిండైన అందం మా మృణాల్ ది అన్నట్లుగా ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆకట్టుకునే రూపంతో పాటు మంచి ఫిజిక్ మృణాల్ సొంతం. అందుకే ఆమె ఎప్పుడు ఏ ఫోటో షేర్ చేసినా కూడా ఇలాగే వైరల్ అవ్వడం మనం చూస్తూ ఉన్నాం. ముందు ముందు టాలీవుడ్ తో పాటు బాలీవుడ్ మరియు కోలీవుడ్ లో కూడా వరుస విజయాలను ఈ అమ్మడు దక్కించుకుంటుందేమో చూడాలి.




## ట్రెండ్ సెట్ చేసిన దర్శకులు.. కమ్ బ్యాక్ ఇవ్వాల్సిందే..



సౌత్ ఇండియాలో అందరి దృష్టిని ఆకర్షించిన తమిళ్ స్టార్ డైరెక్టర్స్ అంటే వెంటనే శంకర్, మురుగదాస్, గౌతమ్ మీనన్, సెల్వ రాఘవన్ పేర్లు వినిపిస్తూ ఉండేవి. వీరు కోలీవుడ్ కి మరుపురాని సక్సెస్ లు ఇచ్చారు. కోలీవుడ్ సినిమా అంటే కచ్చితంగా శంకర్ కి ఒక పేజీ ఉంటుంది. ఆ ఇండస్ట్రీ స్థాయిని శంకర్ తన సినిమాలతో పెంచారని చెప్పొచ్చు. ఏఆర్ మురుగదాస్ కూడా సోషల్ ఎలిమెంట్స్ ని కమర్షియల్ లైన్ లో తెరకెక్కించి బ్లాక్ బస్టర్ హిట్స్ అందుకున్నారు. ఇక ప్రేమకథలు, కాప్ స్టోరీస్ కి కేరాఫ్ అడ్రెస్ గా గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఉండేవారు. సెల్వ రాఘవన్ అనేసరికి లవ్ స్టోరీస్ తో పాటు, యుగానికి ఒక్కడు లాంటి విభిన్న కథలు మనకి గుర్తుకొస్తాయి. అయితే ఈ దర్శకులు గత కొన్నేళ్ల నుంచి ప్రేక్షకులని మెప్పించడంలో ఫెయిల్ అవుతున్నారు. ఈ జెనరేషన్ ఆడియన్స్ పల్స్ పట్టుకోవడంతో విఫలం అయ్యి వరుస పరాజయాలు సొంతం చేసుకుంటున్నారు. స్టార్ డైరెక్టర్ శంకర్ సినిమాలలో సోషల్ కాన్సెప్ట్ కి తోడు బలమైన సంఘర్షణ కనిపిస్తుంది. అలాగే ప్రేక్షకులని కట్టిపడేసే ఎమోషన్స్ కూడా ఉంటాయి. అయితే ఆయన నుంచి చివరిగా వచ్చిన స్నేహితుడా, ఐ, 2.ఓ, ఇప్పుడు ఇండియన్ 2 సినిమాలలో బిగ్గెస్ట్ డిజాస్టర్స్ గా మారాయి. గత సినిమాలలో ఉన్న ఎమోషనల్ ఎలిమెంట్స్ ఈ చిత్రాలలో పూర్తిగా మిస్ అయ్యాయి. గ్రాండ్ నెస్ కోసం ప్రయత్నం చేసి క్రమంలో అతని ఒరిజినాలిటీ మిస్ చేశారనే అభిప్రాయం ప్రేక్షకుల నుంచి వినిపిస్తోంది. ఇక ఏఆర్ మురుగదాస్ 2014లో సల్మాన్ ఖాన్ తో జయహెూ సినిమా చేశారు. ఆ సినిమా ఏవరేజ్ టాక్ తెచ్చుకుంది. తరువాత కత్తి, సర్కార్ సక్సెస్ అయ్యాయి. అయితే స్పైడర్, దర్బార్ సినిమాలు డిజాస్టర్ అయ్యాయి. 2020లో వచ్చిన దర్బార్ తర్వాత మురుగదాస్ లాంగ్ గ్యాప్ తీసుకున్నారు. రొటీన్ కమర్షియల్ ఫార్మాట్ లో మురుగదాస్ కథలు ఉంటున్నాయనే అభిప్రాయం ప్రేక్షకుల నుంచి వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం హిందీలో సల్మాన్ ఖాన్ తో సికందర్, శివకార్తికేయన్ తో ఒక సినిమా మురుగదాస్ చేస్తున్నారు. గౌతమ్ మీనన్ దర్శకుడిగా 2016 నుంచి ఇప్పటి వరకు నాలుగు సినిమాలు చేశారు. అందులో మూడు ఫెయిల్యూర్ అయ్యాయి. విక్రమ్ తో చేసిన ధృవ నక్షత్రం మూవీ రిలీజ్ కి నోచుకోలేదు. సెల్వ రాఘవన్ చాలా సెలక్టివ్ గా సినిమాలు చేస్తారు. అతను చివరిగా 2022 లో నానే వరువన్ సినిమా ధనుష్ తో చేశారు. ఈ సినిమా ఒకే అనిపించింది. యుగానికి ఒక్కడు సీక్వెల్ చేస్తానని ప్రకటించాడు. ఎందుకనో అది ఇంకా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం యాక్టర్ గా బిజీగా అయ్యారు. ఈ నలుగురు దర్శకులు తిరిగి మంచి కథలతో సక్సెస్ ట్రాక్ లోకి రావాలని వారి ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. శంకర్ నెక్స్ట్ గేమ్ చేంజర్ మూవీతో ప్రేక్షకుల ముందుకి రాబోతున్నాడు. మురుగదాస్ సికందర్ సినిమా వచ్చే ఏడాది రిలీజ్ కావొచ్చు. గౌతమ్ మీనన్, సెల్వ రాఘవన్ నెక్స్ట్ మూవీస్ పై ఎలాంటి స్పష్టత లేదు.

## బాలీవుడ్ హిట్ మూవీ రీమేక్.. ఆ ఇద్దరు తెలుగు హీరోలు పోటీ!




'ఇండియాలో ఇప్పటివరకు ఎవరూ చూడని అత్యంత హింసాత్మక సినిమా' అంటూ ప్రమోషన్స్ జరుపుకున్న బాలీవుడ్ మూవీ కిల్. స్టార్ ప్రొడ్యూసర్ కరణ్ జోహార్, గునీత్ మోంగా, అపూర్వ మెహతా సంయుక్తంగా నిర్మించిన ఆ సినిమాకు నిఖిల్ నగేష్ భట్ దర్శకత్వం వహించారు. 2023 టొరెంటో ఫిల్మ్ ఫెస్టివల్ లో ప్రదర్శించడం వల్ల కిల్ మూవీ అంతర్జాతీయ సినిమా ప్రముఖుల దృష్టిలో కూడా పడింది. అయితే ఈ సినిమాను హాలీవుడ్ సూపర్ స్టార్ జాన్ విక్ ఇంగ్లీష్ లో రీమేక్ చేయాలని ఫిక్స్ అవ్వడంతో మూవీపై మరింత బజ్ క్రియేట్ అయింది. లక్ష్య, రాఘవ్ జుయెల్, ఆశిష్ విద్యార్థి, హర్ష్ చాయా, తాన్యా మణిక్ తలా, అభిషేక్ చౌహాన్ కీలక పాత్రలు పోషించిన కిల్ మూవీ.. ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. రిలీజ్ అయిన ఫస్ట్ వీక్ కు గాను రూ.11 కోట్ల వసూలు చేసి మంచి విజయం సాధించింది. ఈ సినిమాలో ఎక్కువ మంది కొత్త నటీనటులు, టెక్నీషియన్లు కనిపించారు. స్టోరీ అంతా ఓ ట్రైన్ లో సాగుతోంది. దీంతో కాస్త భారీగానే నిర్మించారు మేకర్స్. రూ.15 కోట్లకు పైగా వెచ్చించారని సమాచారం. ప్రమోషన్స్ ఎక్కువగా లేకపోయినా మౌత్ టాక్ తో క్లీన్ హిట్ అయిన ఈ మూవీ.. మంచి రివ్యూలు కూడా అందుకుంది. అయితే ఇప్పుడు ఈ సినిమా రీమేక్ హక్కులను పొందేందుకు ఇద్దరు తెలుగు యంగ్ హీరోలు ట్రై చేస్తున్నారని టాక్ వినిపిస్తోంది. సుధీర్ బాబుతో పాటు కిరణ్ అబ్బవరం టీమ్స్.. కరణ్ జోహార్ సొంత బ్యానర్ అయిన ధర్మ ప్రొడక్షన్స్ ను సంప్రదించినట్లు వార్తలు వస్తున్నాయి. అయితే తెలుగులోనే కాకుండా.. తమిళం, మలయాళ మార్కెట్ లలో కూడా క్లిక్ అయ్యే ఫేమ్ ఉన్న హీరో కోసం కిల్ మేకర్స్ వెతుకుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఎవరికి ఆ అవకాశం దక్కుతుందోనని అంతా మాట్లాడుకుంటున్నారు. ఇక మూవీ స్టోరీ విషయానికొస్తే.. రైలులో హీరో (జవాన్) తోపాటు ఆయన ప్రేయసి ప్రయాణిస్తారు. అదే సమయంలో వచ్చిన దొంగల ముఠా కత్తులు, తుపాకులతో రైలులో బీభత్సం సృష్టిస్తుంది. జవాన్ ప్రేయసిని ముఠా చంపేస్తుంది. ఆ తర్వాత హీరో చాలా క్రూరంగా మారతారు. ఆ దొంగల ముఠాను అంతం చేసేందుకు నడుం బిగిస్తారు. చివరకు ఏం జరిగిందనేది సినిమా. మరి రీమేక్ లో ఏ హీరో నటిస్తారో వేచి చూడాలి.

## ఎన్టీఆర్ ఫ్యాన్స్ మనసులు గెలుచుకుంటోంది

ఒక్కో సినిమాలో నటించేందుకు నేటితరం కథానాయికలు కోట్లలో పారితోషికాలు అందుకుంటున్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ యంగ్ బ్యూటీ జాన్వీ కపూర్ హిందీ చిత్రాల్లో నటించేందుకు 5 కోట్ల వరకూ పారితోషికం అందుకుంటోందని ఇంతకుముందు కథనాలొచ్చాయి. ఇప్పుడు టాలీవుడ్ డెబ్యూ మూవీ దేవర కోసం భారీ మొత్తంలో పారితోషికం అందుకుంటోంది. అయితే పారితోషికం అందుకుని, కేవలం నటనలో తన పార్ట్ పూర్తి చేసి వెళ్లిపోవడమేనా? అంటే కానే కాదని జాన్వీ కపూర్ నిరూపిస్తోంది. ఈ భామ తాను నటించే సినిమాల ప్రమోషన్స్ ని ఎంతో బాధ్యతగా తన భుజాన వేసుకుని నడిపిస్తుంది. ఇంతకుముందు మిస్టర్ అండ్ మిసెస్ మాహి–



రూహీ– మిలీ వంటి చిత్రాల ప్రచారానికి జాన్వీ ఏం చేసిందో చూసారు నెటిజనులు. క్రికెట్ నేపథ్యంలో రూపొందించిన మిస్ట్ అండ్ మిసెస్ మాహి చిత్రం ప్రమోషన్ కోసం జాన్వీ తపించిన తీరు అందరినీ ఆశ్చర్యపరిచింది. సోషల్ మీడియాలు సహా వీలున్న అన్ని వేదికలపైనా జాన్వీ తన చిత్రాన్ని ప్రమోట్ చేసుకుంది. క్రికెట్ స్టేడియంకి వెళ్లి ధోని పేరుతో బోలెడంత ప్రచారం చేసుకుని అందరి దృష్టిని ఆకర్షించింది. ఇప్పుడు తన టాలీవుడ్ డెబ్యూ మూవీ దేవర కోసం ఇదే స్ట్రాటజీని అనుసరిస్తోంది జాన్వీ. ప్రచారంలో తనదైన ఒరవడిని చూపిస్తూ బాధ్యతతో నడుచుకుంటున్న ఈ బ్యూటీ తారక్ అభిమానులను విపరీతంగా ఆకర్షిస్తోంది. దేవర ప్రచారం కోసం అవకాశం ఉన్న ఏ వేదికను జాన్వీ విడిచిపెట్టడం లేదు. జాన్వీ తన ఇటీవలి సోషల్ మీడియా పోస్ట్‌ల్లో అంబానీ పెళ్లి నుంచి ఫోటోలను షేర్ చేస్తూనే మధ్యలో చుతంగం అనే హ్యాష్‌ట్యాగ్‌ను జోడించి దేవరకు ప్రచారం చేసుకుంది. తన పాత్ర తంగంను %–%నమ్మశక్యం కాని వినోదాత్మక పాత్ర%–% అని అభివర్ణించింది. దేవర చిత్రంలో భాగమైనందుకు తన కృతజ్ఞతలు తెలియజేసింది. దాదాపు 300కోట్ల బడ్జెట్ తో రూపొందించిన దేవర చిత్రానికి కొరటాల దర్శకత్వం వహించిన సంగతి తెలిసిందే. దేవర: పార్ట్ 1 ఈ ఏడాది సెప్టెంబర్ 27న విడుదల కానుంది. దసరా సెలవులే టార్గెట్ గా వస్తోంది. ఈ చిత్రంలో సైఫ్ అలీ ఖాన్ ముఖ్యమైన పాత్రలో నటించగా.. తారక్ – సైఫ్ మధ్య సన్నివేశాలు మరో లెవల్లో అలరిస్తాయని చెబుతున్నారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం దేవరకు ప్రధాన అస్సెట్ కానుంది. చిత్రబృందం ఇంకా ప్రచారంలో కొంత నెమ్మదిగా ఉన్నా కానీ.. జాన్వీ ప్రచారం ఫ్యాన్స్ లో ఉత్సాహం పెంచుతోంది. జాన్వీ ప్రయత్నం ఎన్టీఆర్ అభిమానుల మనసులను గెలుచుకుంటోంది.

## కన్ను గీటిన అనసూయ.. వైట్ శారీలో కిర్రాక్!

అనసూయ.. అందం.. ఈ రెండూ 'అ'తో మొదలైన పదాలే.. అలాగే వాటికి మంచి కనెక్షన్ ఉందంటున్నారు నెటిజన్లు! అందుకు ఆమె పోస్ట్ చేసిన ఫోటోలనే పర్ఫెక్ట్ ఎగ్జాంపుల్ గా చూపిస్తున్నారు. అప్పుడెప్పుడో చాలా ఏళ్ల క్రితం జూనియర్ ఎన్టీఆర్ నాగ సినిమాలో సిల్వర్ స్క్రీన్ పై కనిపించిన అనసూయ.. ఆ తర్వాత న్యూస్ ప్రజెంటర్ గా దర్శనమిచ్చింది. అనంతరం జబర్దస్త్ కామెడీ షోతో తెలుగు రాష్ట్రాల్లో అందరికీ కనెక్ట్ అయ్యి ఫేమస్ అయింది. అందాల యాంకర్ గా సూపర్ పాపులారిటీ దక్కించుకుంది. ఆ షోలో ఓ రేంజ్ లో హంగామా చేస్తూ సూపర్ క్రేజ్ సంపాదించుకుంది. అలా సినిమా అవకాశాలు అందుకుంది. మూవీస్ లో బిజీగా మారడం వల్ల బుల్లితెర షోస్ కు గుడ్ బై చెప్పేసింది. వైవిధ్యమైన పాత్రలు చేస్తూ.. సిల్వర్ స్క్రీన్ పై అలరిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును గ్రాబ్ చేసుకుంటోంది. టాలీవుడ్ దర్శక నిర్మాతలకు మోస్ట్ వాంటెడ్ యాక్ట్రెస్ గా మారిపోయింది అనసూయ! అయితే సినిమాల్లో




నటిస్తూనే.. టీవీ షోల్లో కూడా సందడి చేస్తోంది. వాటితో పాటు సోషల్ మీడియాలో ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది. సమాజంలో జరిగే పలు విషయాలపై స్పందిస్తుంటోంది. అలా రెగ్యులర్ గా తన ఫ్యాన్స్ తో టచ్ లో ఉంటోంది. ఎప్పటికప్పుడు పిక్స్, వీడియోస్ షేర్ చేస్తూ సందడి చేస్తుంటోంది. తనపై ఎవరైనా తప్పుడు కామెంట్స్ లేదా ట్రోల్స్ చేస్తే ఇచ్చి పడేస్తుంటోంది. నిత్యం నెట్టింట ట్రెండింగ్ లోనే ఉ ంటోంది. ఇక ఆమె ఆందాల ఆరబోతకు స్పెషల్ ఫ్యాన్ బేస్ ఉంది. మోడ్రన్ ఔట్ ఫిట్స్, చీరల్లో వేరే లెవల్ లో గ్లామర్ షో చేస్తుంటోంది అనసూయ. కుర్రాళ్ల మనసులు దోచేస్తుంటోంది. తన చూపు, నవ్వుతో మాయ చేస్తూ క్లీన్ బౌల్డ్ చేస్తుంటోంది. చీరల్లో వయ్యారాలు ఒలకబోస్తూ నెటిజన్లను ఫ్లాట్ చేస్తోంది. తాజాగా వైట్ కలర్ క్రేజీ శారీలో పిక్స్ దిగింది అనసూయ. బ్లాక్ కలర్ స్పెక్ట్స్ పెట్టుకుని.. ఓ రేంజ్ లో పోజులు ఇచ్చి అందరినీ మైమరిపిస్తోంది. వయ్యారంగా కూర్చుని ఒక ఫోటోలో, సైడ్ కట్ లో మరో ఫోటోలో అదరగొట్టేసింది. తన శారీపై ఉన్న క్యాప్షన్ చూపిస్తూ ఆకట్టుకుంటోంది.

కన్ను గీటి మరీ కుర్రాళ్లను ఫిదా చేస్తోంది. ప్రస్తుతం అనసూయ కొత్త పిక్స్ వైరల్ గా మారగా.. ఫ్యాన్స్ రచ్చ రచ్చ చేస్తున్నారు. లైకుల వర్షం కురిపిస్తూ.. కామెంట్ బాక్స్ నింపేస్తున్నారు. క్రేజీ కామెంట్స్ పెడుతూ పిక్స్ ను ట్రెండ్ చేస్తున్నారు. మరి తెల్ల చీరలో అమ్మడి అందాల జాతరను మీరు చూశారా?




హైదరాబాద్: పంట రుణాల మాఫీ విషయంలో రేషన్‌కార్డు నిబంధనపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. పాస్‌బుక్ ఆధారంగానే రూ.2లక్షల రుణమాఫీ ఉంటుందని వెల్లడించారు. కుటుంబాన్ని గుర్తించేందుకే రేషన్‌కార్డు నిబంధన పెట్టినట్లు చెప్పారు. ఈ నెల 18న రూ.లక్ష లోపు రుణాలు మాఫీ చేయనున్నట్లు తెలిపారు. ఎల్లుండి సాయంత్రంలోగా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామన్నారు. రుణమాఫీ సంబురాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. రుణ మాఫీ నిధులు పక్కదారి పట్టకుండా బ్యాంకర్లకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కలెక్టర్ల సమావేశంలో రుణమాఫీ మార్గదర్శకాలపై సీఎం వివరించారు. రాష్ట్రంలో పంట రుణాల మాఫీకి ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. పథకం అమలు విధి విధానాలను వివరిస్తూ సోమవారం ఉత్తర్వులు (జీవో ఆర్టీ నంబరు 567) జారీ చేసింది. ఒక రైతు కుటుంబానికి గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు రుణాలను మాఫీ చేయనుంది. రైతు కుటుంబం గుర్తింపునకు తెల్లరేషన్ కార్డు(ఆహారభద్రత కార్డు)ను ప్రామాణికంగా తీసుకోనున్నట్లు ప్రకటించింది. అన్ని షెడ్యూల్డు, వాణిజ్య, ప్రాంతీయ గ్రామీణ, జిల్లా సహకార బ్యాంకుల నుంచి 2018 డిసెంబరు 12 నుంచి మంజూరైన, రెన్యువలైన రుణాలకు, 2023 డిసెంబరు 9 వరకు బకాయి ఉన్న పంట రుణాలకు, స్వల్పకాలిక రుణాలకు ఇది వర్తిస్తుందని... రుణాల అసలు, దానికి వర్తించే వడ్డీని కలిపి రూ.2 లక్షలు మాఫీ అవుతాయని ప్రభుత్వం తెలిపింది. అయితే తెల్లరేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకోనున్నట్టు ప్రకటించటంతో విపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో రేషన్ కార్డు నిబంధనపై సీఎం స్పష్టత ఇచ్చారు.

## ఆరోగ్యశ్రీపై అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు



హైదరాబాద్: ఆరోగ్యశ్రీపై అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డుకు లింకు పెట్టొద్దని స్పష్టం చేశారు. అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు పారితోషికం పెంచాలని, గిరిజన ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాలు అందేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. అలాగే ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.




ప్రొటోకాల్ ఉల్లంఘనలు, పార్టీ ఫిరాయింపులపై శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్‌కు భారాస ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలను రద్దు చేయాలని.. పది మంది భారాస, ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని సభాపతి దృష్టికి తెచ్చామని కేటీఆర్ అన్నారు. ఫిరాయింపులపై వచ్చిన ఫిర్యాదులపై మూడు నెలల్లోగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదివరకు ఫిర్యాదులు ఇచ్చి నాలుగు నెలలు గడిచినా చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు.

**పార్టీ మారండి.. లేదంటే ప్రాణగండం ఉందని ఎమ్మెల్యేలకు డీఎస్పీలు బెదిరింపులు : కేటీఆర్ –** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న సంగతి తెలిసిందే. ఈ పార్టీ ఫిరాయింపులకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు.

ఈ విషయంపై అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు కేటీఆర్ బదులిచ్చారు. రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో దుర్మార్గమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఒక ఇద్దరు ఎమ్మెల్యేలకు వారి నియోజకవర్గాల్లో ఉన్న డీఎస్పీలు ఫోన్ చేసి పార్టీ మారండి.. లేదంటే ప్రాణగండం ఉందని బెదిరించారు. ఇంకా కొందరిని బెదిరింపులకు గురి చేస్తున్నారు. బీజేపీని వాషింగ్ మిషన్ పార్టీగా విమర్శించిన కాంగ్రెస్ అదే పనిని తెలంగాణలో చేస్తోంది. వేరే రాష్ట్రాల్లో బీజేపీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకుంటే మర్డర్ ఆఫ్ డెమోక్రసీ అంటున్నారు. కానీ మీరు చేస్తున్నది ఏంటని అడిగితే సమాధానం లేదు. కానీ సేమ్ అదే పని తెలంగాణలో చేస్తున్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారకపోతే వారి సొంత ఆస్తులను ధ్వసం చేస్తున్నారు. విజిలెన్స్ దాడులతో బెదిరిస్తున్నారు. భయభ్రాంతులకు గురి చేస్తున్నారు అని కేటీఆర్ తెలిపారు. బడే భాయ్ – చోటే భాయ్‌కి తేడా ఏం లేదు. ఢిల్లీలో బడే భాయ్ నరేంద్ర మోడీ రాజ్యాంగబద్ధ సంస్థలను ఉపయోగించుకున్నట్లుగానే ఇక్కడ చోటే భాయ్ రేవంత్ రెడ్డి ప్రభుత్వ విభాగాలను ఉపయోగించుకుని మా ఎమ్మెల్యేలను బెదిరింపులకు గురి చేస్తున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల మీద మాకు సానుభూతి ఉంది. ఎందుకంటే వారికి వారే ఆత్మహత్య చేసుకున్నారు. వారిని ఎవరూ కాపాడలేరు. ప్రజలు తప్పకుండా శిక్షిస్తారు. రాజకీయాల్లో హత్యలు ఉండవు.. ఆత్మహత్యలే ఉంటాయనడానికి ఇదే ఉదాహరణ అని కేటీఆర్ పేర్కొన్నారు.

## రైతు రుణమాఫీకి రేషన్ కార్డుల షరతులు ఎందుకు..?



హైదరాబాద్: రైతు రుణమాఫీ మార్గదర్శకాలు చూస్తే వడపోతల, రైతుల సంఖ్య కోత మీద దృష్టి పెట్టినట్లు కనిపిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రుణమాఫీకి రేషన్ కార్డుల షరతులు ఎందుకని ప్రశ్నించారు. చేతల పాలన పోయి.. షరతుల పాలన వచ్చిందని విమర్శించారు. బ్యాంక్‌లు రేషన్ కార్డులు చూసి రుణం ఇచ్చారా? అని నిలదీశారు. రైతును రైతుగా చూడాలని సూచించారు. రైతు రుణమాఫీకి ఇన్ని షరతులు ఎందుకని ప్రశ్నించారు. రేషన్ కార్డులో విడిపోయినంత మాత్రాన రుణమాఫీకి అర్హులు కారా అని నిలదీశారు. ఇది రైతులను మోసం చేయడమేనని విమర్శించారు.

ఏడు నెలలుగా కొత్త రేషన్ కార్డులు ఎందుకు ఇవ్వట్లేదని అడిగారు. కుటుంబం, రేషన్ కార్డు అనే షరతులు ఎత్తేయాలని అన్నారు. పీఎం కిసాన్ నిబంధన తీసుకోవడం అంటే 39లక్షల మంది రైతుల రుణమాఫీ ఎగ్గొట్టడమేనని చెప్పారు. రూ.2లక్షల రూపాయలు నేరుగా రైతుల ఖాతాలో జమ చేయాలని అన్నారు. రైతు రుణమాఫీని ఆలస్యం చేసే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. స్వల్ప కాలిక రుణాలకే వర్తిస్తుందని అంటూ పండ్ల తోటలు పెట్టిన రైతులకు ఎగ్గొడుతున్నారని మండిపడ్డారు. రీ షెడ్యూల్ రైతులకు వర్తించదంటే రైతులు నష్టపోతారని చెప్పారు. షరతులు ఉపసంహరించుకోవాలని లేదంటే రైతుల పక్షాన పోరాడుతామని తెలిపారు. అసెంబ్లీలో రైతు రుణమాఫీపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ నేతలకు ప్రోటోకాల్‌పై మాట్లాడే అర్హత లేదు

హైదరాబాద్: బీఆర్ఎస్ నేతలకు ప్రోటోకాల్‌పై మాట్లాడే అర్హత లేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి సబితారెడ్డికి ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చామని.. ఆమెకు గౌరవం ఇవ్వకపోతే అడగాలని.. మర్యాద లోపం ఉంటే తప్పు పట్టాలని అన్నారు. మల్కాజ్‌గిరి ఈటల కార్యక్రమానికి వెళ్లకుండా ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమానికి ఈటల తెరలేపారని చెప్పారు. గాంధీభవన్‌లో జగ్గారెడ్డి ఈరోజు(మంగళవారం) మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రోటోకాల్ లేకుండా కొందరు బతహకలేకపోతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక టెన్షన్ లేకుండా పని చేస్తున్నామని సెక్రటేరియట్ ఉద్యోగులు చెబుతున్నారని అన్నారు. పదేళ్లలో రేషన్ కార్డే దిక్కు లేదని చెప్పారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇచ్చానని కాలర్ ఎగరేసి చెప్పగలరా? అని ప్రశ్నించారు. “కాంగ్రెస్ వచ్చాకే రేషన్ కార్డులు ఇస్తున్నాం. పార్టీలు మారడం కామన్. ఇది సీరియస్ మ్యాటర్ కాదు. పాలిటిక్స్‌లో రాజకీయ పార్టీలు అత్తగారిల్లు, తల్లి గారిల్లు లాగా అయిపోయాయి. ఎమ్మెల్యేలు పార్టీ మారడాన్ని ప్రజలు కూడా సీరియస్‌గా తీసుకోవడం లేదు. పార్టీ మార్పుపై మాట్లాడడం అవసరమే లేదు. కాంగ్రెస్ చరిత్రతో పోలిస్తే కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ వయస్సు, అనుభవం చాల చిన్నది. పదేళ్ల అనుభవంలో కేసీఆర్, కేటీఆర్, హరీష్ అ,ఆ లు కూడా నేర్చుకోలేకపోయారు. ప్రతిపక్షాలను గౌరవించేది కాంగ్రెస్ ప్రభుత్వమే. హరీష్‌రావు, కేటీఆర్‌లకు మతిమరుపు వచ్చినట్టుంది.

వారు హాస్పిటల్‌కు వెళ్లి చెక్ చేయించుకోవాలి. నా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మాట్లాడితే కేటీఆర్, హరీష్ రావులను పిచ్చొళ్లుగా అర్థం చేసుకుంటారు. రేవంత్ ఎంపీగా ఉన్నప్పుడు ఎప్పుడైనా ప్రోటోకాల్ పాటించారా? రేవంత్ విషయంలో ప్రోటోకాల్ పాటించని బీఆర్ఎస్ నేతలకు ప్రోటోకాల్‌పై మాట్లాడే అర్హత లేదు. కోమటిరెడ్డి, సంపత్ ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు కుట్ర చేసి అసెంబ్లీకి రానివ్వకుండా చేసినప్పుడు ప్రోటోకాల్ గుర్తుకురాలేదా? వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవాలని ఆ పార్టీ నేతలే మొక్కుకున్నారు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఓడిపోయిన ఎమ్మెల్యేతో హరీష్ రావు కొబ్బరికాయ కొట్టించాడు. సీఎం, మంత్రులను రోజూ చాలామందిని కలుస్తున్నారు” అని జగ్గారెడ్డి పేర్కొన్నారు.




## సోమవారంలోపు కమిషన్‌కు కొత్త ఛైర్మన్‌ను నియమిస్తాం: తెలంగాణ ప్రభుత్వం

ఢిల్లీ: తెలంగాణలో విద్యుత్ ఒప్పందాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్‌కు కొత్త ఛైర్మన్‌ను సోమవారం లోపు నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ అంశంలో భారాస అధినేత కేసీఆర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కమిషన్ పంపిన సమన్లపై హైకోర్టు ఈ నెల 1న ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ నర్సింహారెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించడంపై సుప్రీంకోర్టు అభ్యంతరం తెలిపింది. కమిషన్ ఛైర్మన్‌ను మార్చాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఛైర్మన్‌ను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలిపింది. భోజన విరామం తర్వాత తదుపరి విచారణ కొనసాగిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. అయితే భోజన విరామ సమయంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. విద్యుత్ ఒప్పందాలపై విచారణ నుంచి తప్పుకొంటున్నట్లు న్యాయవాది ద్వారా జస్టిస్ నర్సింహారెడ్డి సుప్రీంకోర్టుకు లేఖ పంపారు. దీంతో ఆయనస్థానంలో మరొకరి నియామకానికి అత్యున్నత న్యాయస్థానం సమయమిచ్చింది. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే కొత్త జడ్జి నేతృత్వంలో కమిషన్ విచారణ కొనసాగించవచ్చని పేర్కొంది. సోమవారంలోపు నూతన ఛైర్మన్‌ను నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దీంతో కేసీఆర్ పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్టు సీజేఐ ధర్మాసనం వెల్లడించింది. ఇరుపక్షాల తరఫున సీనియర్ న్యాయవాదులు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా.. కేసీఆర్ తరఫున ముకుల్ రోహత్గీ వాదించారు.

**జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ప్రెస్‌మీట్‌లో ఏం చెప్పారంటే? :** ఇటీవల బీఆర్కే భవన్‌లో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ఎస్ఏఎం రిజ్వీ, ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు, ఇతర అధికారులతో కమిషన్ ఛైర్మన్ రెండు గంటల పాటు సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. “యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్, ఛత్తీస్‌గఢ్‌తో రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు ఒప్పందం చేసుకున్న సమయంలో నిర్ణయాలు తీసుకున్న కొంతమంది అధికారుల అభిప్రాయాలు తెలుసుకోవాల్సి ఉంది. ఆ సమయంలో ఉన్న అధికారులు, ప్రజాప్రతినిధులు అందరికీ లేఖలు రాస్తాం. ఈ విషయంలో ప్రజా అభిప్రాయ సేకరణ ఉంటుంది. సమాచారం అవస రం అనుకున్న వారికి నోటీసులు కూడా అందజేస్తాం. రాజకీయాలకు అతీతంగా విచారణ చేపడతాం, వంద రోజుల్లో నివేదిక సమర్పిస్తాం” అని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ నర్సింహారెడ్డి తెలిపారు. ఆ తర్వాత భారాస అధినేత కేసీఆర్‌కు నోటీసులు జారీ చేశారు. “విద్యుత్ కమిషన్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించింది. జస్టిస్ నరసింహారెడ్డి ఏకపక్షంగా ప్రెస్‌మీట్ పెట్టి వివరాలను వెల్లడించారు. ఇది సుప్రీం కోర్టు తీర్పులకు విరుద్ధం. విద్యుత్ కొనుగోలు, పవర్ ప్లాంట్ల నిర్మాణాలపై వివరణ ఇవ్వాలని కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చారు. నోటీసులకు సమాధానం ఇవ్వకముందే జస్టిస్ నర్సింహారెడ్డి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు” అని కేసీఆర్ తరఫు న్యాయవాదుల వాదన.

## విద్యుత్ ఒప్పందాలపై విచారణ నుంచి తప్పుకున్న జస్టిస్ నరసింహా రెడ్డి



హైదరాబాద్ : బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దెబ్బకు జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి తప్పుకున్నారు. తెలంగాణలో విద్యుత్ ఒప్పందాలపై ఏర్పాటు చేసిన కమిషన్ నుంచి తప్పుకుంటున్నట్టు సుప్రీంకోర్టుకు జస్టిస్ నరసింహా రెడ్డి లేఖ పంపారు. దీంతో ఆయన స్థానంలో మరొకరి నియామకానికి అత్యున్నత న్యాయస్థానం సమయం ఇచ్చింది. ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారమే కొత్త జడ్జి నేతృత్వంలో కమిషన్ విచారణ కొనసాగించొచ్చని పేర్కొంది. సోమవారం లోపు కొత్త ఛైర్మన్‌ను నియమిస్తామని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు తెలిపింది. దీంతో కేసీఆర్ పిటిషన్‌పై విచారణ ముగిస్తున్నట్లు సీజేఐ ప్రకటించింది.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ నర్సింహారెడ్డితో జ్యుడిషియల్ కమిషన్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఆ కమిషన్ విచారణను సవాల్ చేస్తూ కేసీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు మంగళవారం ఉదయం విచారణ చేపట్టింది. ఇరుపక్షాల తరఫున సీనియర్ న్యాయవాదులు సుదీర్ఘంగా వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అభిషేక్ మనుసింఘ్వీ, సిద్ధార్థ్ లూథ్రా, కేసీఆర్ తరఫున ముకుల్ రోహత్గీ వాదించారు. ఈ వాదనల అనంతరం విద్యుత్ ఒప్పందాలపై ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ ఛైర్మన్‌ను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ నర్సింహారెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించడంపై కోర్టు తీవ్ర అభ్యంతరం తెలిపింది. కమిషన్‌ను మార్చాలని కోర్టు ఆదేశించింది.

మధ్యాహ్నం 2 గంటల లోపు నూతన ఛైర్మన్ పేరును వెల్లడిస్తామని పేర్కొంది. భోజన విరామం అనంతరం తదుపరి విచారణ కొనసాగిస్తామని కోర్టు తెలిపింది. అయితే భోజన విరామ సమయంలో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. విద్యుత్ ఒప్పందాలపై విచారణ నుంచి తప్పుకుంటున్నట్టు ఓ న్యాయవాది ద్వారా జస్టిస్ నర్సింహారెడ్డి సుప్రీంకోర్టుకు లేఖ పంపారు.



## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు, ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్‌కు ఫిర్యాదు

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీలో చేరిన పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని, పలు నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పిటిషన్లు సమర్పించారు. బీఆర్ఎస్ బీ ఫాంపై గెలుపొంది పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన పది మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కోరారు. అదే విధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గెలిచిన నియోజకవర్గాల్లో అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నట్లు స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. ఆయా నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన వారికి ప్రాధాన్యత ఇస్తూ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. వీటిన్నింటిపై దృష్టి సారించి, పరిష్కరించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, పద్మారావు గౌడ్, వేముల ప్రశాంత్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కేపీ వివేకానంద గౌడ్ ఉన్నారు.

## బీఆర్ఎస్ పాఠాలు నేర్పాలని చూస్తోంది: కాంగ్రెస్ నేత కోదండరెడ్డి

హైదరాబాద్: రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ పార్టీ రైతులను గందరగోళానికి గురి చేస్తోందంటూ కాంగ్రెస్ కిసాన్ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి మండిపడ్డారు. రుణమాఫీపై కాంగ్రెస్ పార్టీకి, రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన ఆలోచనలు ఉన్నాయని ఆయన చెప్పారు. దీనికి సంబంధించిన విధివిధానాలు సోమవారం విడుదల చేసినట్లు కోదండరెడ్డి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నేతలు రుణమాఫీ అంశంలో రైతులను పరేషాన్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గులాబీ నేతలు మాకు పాఠాలు నేర్పుతున్నారని, దేశంలో మొదటిసారి రుణమాఫీ చేసింది కాంగ్రెస్ సర్కారే అని ఆయన గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఆ పథకాన్ని తీసుకొచ్చారు. పథకానికి సంబంధించిన ప్రతిపాదనలు అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఎదుట ఆయన పెట్టారు. దాన్నే అప్పటి యూపీఏ సర్కార్ దేశవ్యాప్తంగా అమలు చేసిందని కోదండరెడ్డి గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వం ఎన్నిసార్లు రుణమాఫీ చేసిందో చెప్పాలని, వారికి బకాయిలు చెల్లించడమే సరిపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. తాము పకడ్బందీ విధానాలతో ఒకేసారి రూ.2లక్షలు మాఫీ చేస్తూ రైతులను ఆదుకుంటున్నట్లు చెప్పారు. అర్హులకు లబ్ధి అందలేదంటూ బీఆర్ఎస్ వాళ్లు గోల్‌మాల్ చేస్తూ మమ్మల్ని తప్పుపడుతున్నారు. గత పదేళ్లల్లో ఎంతమందికి రుణమాఫీ చేశారో గులాబీ నేతలు సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు.

ఆర్బీఐ కూడా వ్యవసాయానికి పెద్దపీట వెయ్యాలని చెబుతోందని కోదండరెడ్డి చెప్పుకొచ్చారు. రేషన్ కార్డు ఉంటేనే రుణమాఫీ అని పెట్టాం. కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకొని దాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. లబ్ధిపై రైతులకు ఎలాంటి అనుమానాలు ఉన్నా స్థానిక వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించవచ్చని కిసాన్ కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి సూచించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com